క్లుప్తంగా

నటుడు ఆదినారాయణకు అరుదైన సత్కారం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల ఆదినారాయణకు అరుదైన సత్కారం లభించింది. గుంటూరుకు చెందిన శ్రీగౌరీశంకర నాట్యమండలి ఆధ్వర్యంలో నల్లచెరువు రామాలయం వద్ద ఆదివారం పౌరాణిక నాటకోత్సవం నిర్వహించారు. వివిధ నాటకాల్లోని సీన్లను ప్రదర్శించారు. శ్రీ కృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుని పాత్రలో నటించిన ఆదినారాయణను 'కళాజ్యోత్స్న' బిరుదుతో సత్కరించి వెండి కిరీటాన్ని బహూకరించారు. 'ఆంధ్ర గానకోకిల' ఏవీ సుబ్బారావు మూడో కుమారుడైన ఆదినారాయణరావు తండ్రి, సోదరుల బాటలోనే కళారంగాన్ని నమ్ముకున్నారని.. తన ప్రతిభతో 'నంది', 'గరుడ' సహా అనేక పరిషత్ బహుమతులు, రాష్ట్ర ప్రభుత్వంతో 'కందుకూరి' పురస్కారాలను అందుకున్నారని నాట్యమండలి అధ్యక్షుడు సనిశెట్టి సాంబశివరావు ప్రశంసించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ నేత నలకా శ్రీనివాసరావు, నాయుడు గోపి, చెన్నుపాటి కృష్ణారావు, సిరిగిరి సాంబశివరావు, దర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పసుపు రైతులకు ఆర్థిక సహాయం



కొల్లిపర: పసుపు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్రీయ కృషి వికాష్ యోజన పథకం ద్వారా ఎకరానికి రూ.9,600 ఆర్థిక సహాయం అందిస్తుందని.. ఈ అవకాశాన్ని పసుపు సాగు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెనాలి హార్టికల్చర్ అధికారిణి తోటకూర శ్రీనిత్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా శీలం, బీఎస్ఆర్, మైదుకూరు వంటి రకాల పసుపు సాగు చేస్తున్న రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. ఈ పథకం కోసం రైతులు తమ వెంట ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, సాగు చేస్తున్న భూమి 1బీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ శాఖ లేదా హార్టికల్చర్ సిబ్బందిని కలిసి అర్జీ పొందం తీసుకుని నమోదు చేయాలని సూచించారు. కావున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నూతన రోడ్లు, కాలువలు నిర్మించాలి



తెనాలి అర్బన్: 28వ వార్డులో నూతన రోడ్లు నిర్మించాలని.. ఐతానగర్ సిద్ధార్థ కాలనీలో నూతన కాలువలు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గాంధీనగర్‌లో ఆక్రమణలు తొలగించాలని ఒకరు వినతి పత్రం ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ పరిష్కార వేదికలో 12 అర్జీలు



తెనాలి టౌన్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు వచ్చినట్లు సబ్‌కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. రెవెన్యూ 3, మున్సిపల్ 3, పోలీసు 1, పంచాయతీరాజ్ 2, మెడికల్ 1, సబ్ రిజిష్టర్ కార్యాలయం 1, విద్యుత్ కార్యాలయానికి సంబంధించి 1, మొత్తం 12 అర్జీలు వచ్చాయని వీటిని సంబంధిత శాఖలకు బదలాయించి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామని వివరించారు. అర్జీల్లో ఉన్న సమస్యలపై ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్‌లకు రాని దరఖాస్తులు

నేటితో ముగియనున్న గడువు

తెనాలి రూరల్: తెనాలిలో బార్‌లకు సోమవారం సాయంత్రం వరకూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మంగళవారంతో గడువు ముగియనుండడంతో సాయంత్రం దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో 19 బార్లు ఉన్నాయి. వీటిలో 17 అన్ రిజర్వుడ్ కేటగిరీకి చెందినవి కాగా రెండు కల్లు గీత కులాలకు రిజర్వ్ చేశారు.

జిల్లా వైద్యశాలలో దళారుల దందా!

- పలు విభాగాల వద్ద ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ
- ల్యాబ్ పరీక్షలు, కళ్లజోళ్లు అమ్మకాలు
- సదరంలోనూ దళారులుగా కొందరు ఉద్యోగులు

తెనాలి జిల్లా వైద్యశాల దళారులకు అడ్డాగా మారుతోంది. తల్లీపిల్లల వైద్యశాలలో ఓ మహిళ కొందరు గైనకాలజిస్టుల సహకారంతో గర్భిణులకు వివిధ పరీక్షల పేరిట దోపిడీలకు పాల్పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే దివ్యాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్‌లలో కూడా కొందరు ఉద్యోగులు దళారులుగా మారి దోచుకునే పనిలో పడ్డారని సమాచారం.

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాల 200 పడకలతో.. అదే ఆవరణలో ఉన్న తల్లీపిల్లల వైద్యశాల 100 పడకలతో ఉంది. రోజూ 1000 మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతుంటారు. వీరు కాకుండా సగటున రోజూ 300 మంది రోగులు ఇన్‌పేషెంట్‌లుగా చికిత్స పొందుతుంటారు. తెనాలి జిల్లా వైద్యశాలలో గైనిక్, పిడియాట్రిక్, ఆర్థో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆప్తామాలజీ, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన వైద్య సేవలు అందుతుంటాయి.

గర్భిణుల దగ్గర దోపిడీ..

గర్భిణులు తల్లీపిల్లల వైద్యశాలకు వచ్చి గైనికాలజిస్టులకు చూపించుకుని వారి సూచన మేరకు మందులు వాడుతుంటారు. ఇక్కడ రోజూ సుమారు 200 మందికి పైగా గర్భిణులు వైద్య సేవలు పొందుతుంటారు. ఇక్కడే అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉంది. అలాగే జిల్లా వైద్యశాలలో అధునాతన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే సమీపంలో ప్రైవేట్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్న ఓ మహిళ కొందరు వైద్యుల సహకారంతో రక్త, మూత్ర పరీక్షల పేరిట దోపిడీకి పాల్పడుతోంది. దీనిలో భాగంగా తమ వద్ద అతి తక్కువ ధరకు పరీక్షలు చేస్తామని నమ్మబలికి గర్భిణుల నుంచి దోచుకునే పనిలో నిమఘ్నమయ్యింది. ఇలా ఏడాదిగా జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

ఇక్కడే కళ్ల జోళ్ల విక్రయాలు..

జిల్లా వైద్యశాలలో ఆప్తామాలజీ విభాగం ఉంది. ఈ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి దృష్టిలోపం ఉన్న రోగులకు తమ వద్ద కళ్లజోళ్లు ఉన్నాయని చెప్పి అక్కడ వాటి విక్రయాలు ప్రారంభించారు. పరీక్ష చేసిన మరుసటి రోజు నగదు తీసుకుని కళ్లజోళ్లు అందజేస్తున్నారు. అలానే వైద్యశాలలో ఎన్ఆర్‌ఐ హాస్పటల్ సహకారంతో ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్‌ను గతంలో ఏర్పాటు చేశారు. రోగులకు పరీక్షలు చేసినందుకు ప్రభుత్వం ఎన్ఆర్ఐ హాస్పటల్‌కు నగదు చెల్లిస్తూ ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు పరీక్షలు చేస్తుంటారు. అయితే అక్కడ పనిచేసే ఉద్యోగి ఒకరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా రోగి సాయంత్రం 6 గంటల తర్వాత వచ్చి ఎంఆర్‌ఐ చేయాలని కోరితే వారి నుంచి రూ.2,500 నుంచి రూ.3,500 వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలానే ఆరోగ్యశ్రీ కింద చేరిన రోగుల నుంచి వారి వివరాలు అప్‌లోడ్ చేయాలనే నెపంతో కొందరు డీఈవోలు పేదలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఓపీ విభాగం వద్ద ప్రజలు



తెనాలిలోని జిల్లా వైద్యశాల

సదరంలోనూ మాయాజాలం..

జిల్లా వైద్యశాలలో ప్రతి మంగళవారం సదరం క్యాంప్‌ను నిర్వహిస్తుంటారు. తెనాలిలో ఈఎన్‌టీ, ఆర్థో, సైక్రాటిక్ విభాగాల క్యాంప్ జరుగుతుంది. ఆప్తామాలజీ వైద్యురాలు సెలవులో ఉండడం వల్ల ఆ విభాగంను తాత్కాలికంగా క్యాంప్ నుంచి మినహాయించారు. ఆర్థో, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన కొందరు వైద్యులు ఒక్కో దివ్యాంగుడి నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారణలు జరపటంతో కొంత కాలం దందా నిలచిపోయింది. మరలా ఇప్పుడు అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలిసింది.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం..



వైద్యశాలలోని ఆప్తామాలజీ విభాగంలో కళ్లజోళ్ల విక్రయం నా దృష్టికి వచ్చింది. సదరు ఉద్యోగిని హెచ్చరించాం. మరోసారి ఇలా చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అలానే సదరం క్యాంపు వద్ద సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఒకరిపై చర్యలు తీసుకున్నాం. సదరంలో జరిగే అవినీతి, తల్లీపిల్లల వైద్యశాలలో జరిగే ప్రైవేట్ ల్యాబ్ పరీక్షలపై విచారణ జరుపుతాం. ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రంగారావు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగ జిల్లా కో–ఆర్డినేటర్, గుంటూరు

ఇనుప గడ్డర్లతో ఇబ్బందులు

వంతెన నిర్మాణం చేయాలని వినతి

తెనాలి రూరల్: తెనాలి–రేపల్లె రైలు మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తెనాలి–చందోలు రహదారిపై ఉన్న ఈ వంతెన నిర్మించి సుమారు శతాబ్ద కాలం దాటింది. బలహీనంగా ఉందంటూ భారీ వాహనాల వల్ల వంతెనకు ఇబ్బందులు తలెత్తకుండా గడ్డర్లను నిర్మించారు. అయితే వీటి వల్ల తరచూ వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైల్వే వంతెన నుంచి వెళ్లే వాహనాల ఎత్తు, వైశాల్యాన్ని నియంత్రిస్తూ ఈ గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఇవి తరచూ విరిగి పడుతుండడం, వాహనాలకు తగిలి దెబ్బతినడం వంటి కారణాలతో ఈ రహదారిలో తరచూ వాహనాల రాకపోకతకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రాకపోకలకు అవస్థలు..

వినాయక చవితి సందర్భంగా బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మోపర్రు గ్రామానికి చెందిన యువకులు సుమారు 14 అడుగుల విగ్రహాన్ని కొనుగోలు చేసి గ్రామానికి ఆదివారం రాత్రి తీసుకెళుతుండగా ఈ ఇనుప గడ్డర్లు విగ్రహానికి తగిలాయి. దీంతో యువకులు క్రేన్‌ను తీసుకువచ్చి గడ్డర్లను దాటించే ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. దీంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చివరికి చేసేది లేక మరో వాహనంలో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కోవిడ్ సమయంలో నెలల పాటు రైళ్ల రాకపోకలను ఆ శాఖ రద్దు చేసింది. ఆ సమయంలోనైనా ఇటువంటి బలహీనంగా ఉన్న వంతెనలను పడగొట్టి కొత్తవి నిర్మిస్తే ఇటువంటి గడ్డర్ల ఇబ్బందులు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



వినాయక విగ్రహాన్ని క్రేన్ సాయంతో గడ్డర్లను దాటిస్తున్న యువకులు

విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలు

తెనాలి: జాతీయస్థాయిలో ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకూ జరిగే నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ 'విజ్ఞానవేదిక' ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు, నేత్ర సంరక్షణ, నేత్రదానంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. స్థానిక అయితానగర్‌లోని శ్రీ నన్నపనేని సరస్వతీ సీతారామయ్య స్మారక మున్సిపల్ హైస్కూలులో ఈ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. విజ్ఞాన వేదిక అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాద్ మాట్లాడుతూ.. బాలబాలికలకు చిన్న వయసు నుంచి పర్యావరణ పరిజ్ఞానం, నేత్రాలకు సంక్రమించే వ్యాధులు, దృష్టిదోషాల నివారణ మార్గాలు, నేత్రదానం ఆవశ్యకత వంటి అంశాలపై అవగాహన కోసం కేంద్ర ప్రభుత్వం పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ కె.పుల్లారావు కంటి పరీక్షలను చేశారు. డాక్టర్ పి.భాస్కర్ నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకతలను వివరించారు. ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి కార్యక్రమ ఆవశ్యకతను తెలియజేశారు.

ఏటా మట్టి గణపతుల ప్రతిమలు పంపిణీ!



బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిమల పంపిణీ(ఫైల్)



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..(ఫైల్)

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థలు

తెనాలి టౌన్: పర్యావరణహితం కోరే స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతిని పూజించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మట్టి గణపతిని పూజించి నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని వివిధ రూపాల్లో చెబుతున్నారు. వేలాది రూపాయిలు ఖర్చు చేసి మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా ప్రజలు పంపిణీ చేస్తున్నారు. రోటరి క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో 7 ఏళ్లుగా పట్టణ ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వివిధ సేవా కార్యక్రమాలతో పాటు క్లబ్ ఆధ్వర్యంలో 2000 మట్టి గణపతి విగ్రహాలను, వినాయక వ్రత కల్పాన్ని ఇస్తున్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు.



తెనాలిలో రోటరీ క్లబ్ పంపిణీ చేస్తున్న ప్రతిమలు(ఫైల్)

బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో..

బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో 2015 నుంచి పట్టణంలో ఐదు చోట్ల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు. 2024 అధ్యక్షుడిగా ఎన్నికైన పార్థసారధి ఆధ్వర్యంలో గణపతి ప్రతిమలను ఉచితంగా ఇస్తున్నారు. పరిషత్ కార్యాలయం, రామలింగేశ్వరపేట, పినపాడు, మారీసుపేట, గంగానమ్మపేట ప్రాంతాల్లోని శివాలయాల వద్ద మంగళవారం సాయంత్రం ప్రతిమల పంపిణీ ఉంటుందని చెప్పారు. చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, అమరావతి మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో 6 ఏళ్లుగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ నిర్వహిస్తున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీశైల భక్త సేవా సమితి పలు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మట్టి గణపతిని పూజించి స్వామి కృపకు పాత్రులు కావాలని స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) పరిధిలోని యర్రబాలెంలో ద్విచక్ర వాహనం చోరీకి గురయిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు మల్లేష్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 22వ తేదీన తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం తెల్లవారి చూసే సరికి కనిపించలేదన్నారు. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సీసీ కెమెరాలో పుటేజిని పరిశీలించగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాన్ని నడిపించుకుంటూ వెళుతుండగా తమ ఇంటి వద్ద ఓ యువకుడు ద్విచక్ర వాహనం తీసుకెళ్తున్న యువకులను అడ్డగించగా పెట్రోలు అయిపోయిందని చెప్పి ఉడాయించారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకుడు హోచ్‌మన్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్నా, నీరు మురికిగా వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి నీటిని వాడటం వల్ల ప్రజలు చర్మ సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. చెరువుల్లో నీటిని శుభ్రం చేసి విడుదల చేయాలన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదేవిధంగా పొగాకు కొనుగోలు చేసిన వారు రైతులకు నగదు చెల్లించాలని తెలిపారు. పొగాకు కొనుగోలులో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా కొనుగోళ్లు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, జి.వెంకటేశ్వరరావు, అంకమ్మరావు, ఎం.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించం



ఎరువులను తనిఖీ చేస్తున్న అధికారులు



స్టాక్ పరిశీలిస్తున్న ఏవో సుధీర్‌బాబు

తూములూరు (కొల్లిపర): వ్యాపారులు రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డితో కలిసి మండలంలోని తూములూరు గ్రామంలోని ఎరువుల దుకాణాలను వారు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. ఎవరైనా ఎరువులు ఉంచుకుని లేవని రైతులకు చెబితే అటువంటి సమయంలో రైతులు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు పేర్కొన్నారు.

తెనాలి టౌన్: రైతులకు డీఏపీ, యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ తెనాలి సహాయ సంచాలకులు కె.రాజకుమారి తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లోని ఎరువుల షాపులను, గ్రోమోర్ సెంటర్‌లను సోమవారం ఆమె తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించారు. కొలకలూరు గ్రోమోర్ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ ఎంత ఉంది తెలుసుకున్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా అవసరమైన మేర యూరియా, డీఏపీ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, ఏఈవో మోహన్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను పంపిణీ బాధ్యత నుంచి మినహాయించాలని వినతి

కొల్లిపర: సామాజిక పింఛన్లు ఇచ్చే బాధ్యత నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొల్లిపర తహసీల్దార్ జి.సిద్ధార్థకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ విధులకు ఇబ్బంది కలిగించే ఈ సామాజిక పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మలజ్యోతి, ఎం.సీతమ్మ, ఎస్.లక్ష్మీ, లక్ష్మీదేవి, టి.లావణ్య, ఎం.వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అధికార భాషా సంఘానికి ఆ పేరు తగదు

ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పురుషోత్తమ శర్మ



తెనాలి: రాష్ట్ర అధికార భాషా సంఘానికి గిడుగు శ్రీరామమూర్తి పంతులు లేదా తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణలో ఎవరో ఒకరి పేరిట నామకరణం చేయాలని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ ప్రభుత్వాన్ని కోరారు. అధికార భాషా సంఘానికి, దివంగత నేత మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టడం పట్ల ఆయన సోమవారం ఒక ప్రకటనలో విస్మయం వ్యక్తం చేశారు. మండలి వెంకటకృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన రాజకీయనేతగా పేర్కొంటూ.. అధికార భాషా సంఘానికి పేరు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. గిడుగు శ్రీరామమూర్తి లేదా విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖుల పేరు పెడితే అధికార భాషాసంఘం ప్రతిష్ఠ పెరుగుతుదని అభిప్రాయపడ్డారు.

ఐరన్ స్క్రాప్ విగ్రహం 'బుల్' ఆవిష్కరణ

తెనాలి: సంస్కార భారతి అఖిలభారత సంఘటన కార్యదర్శి అభిజిత్ గోఖలే సోమవారం స్థానిక ఆటోనగర్ సమీపంలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని ప్రత్యేకంగా సందర్శించారు. మూడు టన్నుల ఇనుప వ్యర్థాలతో రూపొందించిన 'బుల్' విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆర్ట్ గ్యాలరీలోని వివిధ రకాల విగ్రహాలను తిలకించి, ఆయా విశేషాలను శిల్పకారులు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు కాటూరి రవిచంద్ర నుంచి ఆయన తెలుసుకున్నారు. గ్యాలరీలో కొలువుదీరిని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని చూడగానే పూలమాల వేసి భక్తిని ప్రదర్శించారు. కాంస్యం, ఫైబర్, పంచలోహ, స్టెయిన్లెస్ స్టీల్, ఐరన్ స్క్రాప్‌తో చేసిన విగ్రహాలతో కూడిన ఆర్ట్ గ్యాలరీ దేశంలో ఇదే ప్రథమమని ఈ సందర్భంగా కాటూరి వెల్లడించారు.అభిజిత్ గోఖలే మాట్లాడుతూ.. గ్యాలరీలోని ఐరన్‌స్క్రాప్ విగ్రహాలు బంగారు నగలను అతికినంత శ్రద్ధగా చేసినట్లు ఉన్నాయని ప్రశంసించారు. పురాణ పురుషులతో పాటు వల్లభాయ్ పటేల్ సహా రాజకీయ నేతల విగ్రహాలు జీవం ఉట్టిపడేలా ఉన్నాయని చెప్పారు. శిల్పకారులను అభినందించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, కార్యదర్శి రామ్‌కుమార్, సభ్యులు అల్లు రాంబాబు, మురళీధర్ పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి నమస్కరిస్తున్న అభిజిత్ గోఖలే

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!

- తొలి విడతగా 40 మందిపై వేటు!
- మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం

తెనాలి: పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విడతల వారీగా తొలగించేందుకు రంగం సిద్ధంచేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకున్నా, అధికారులే అత్యుత్సాహంతో ఇందుకు పూనుకున్నట్లు తెలిసింది. నేరుగా తొలగించాలని ఆదేశించినా, అందుకు దిగువస్థాయి అధికారులు వ్యతిరేకించారు. దీంతో పద్ధతి ప్రకారం తొలగింపునకు సన్నాహాల్లో ఉన్నారు. దీంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఏడాది క్రితం తొలగింపు నోటీసులిచ్చి, అందరి వ్యతిరేకతతో వెనక్కి తగ్గినప్పటికీ మళ్లీ ఇప్పుడు పదవుల్లో ఉన్న అధికారులు ఇందుకు పూనుకున్నారని చెబుతున్నారు.

కొనసాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..

2014–19 మధ్యకాలంలో టీడీపీ హయాంలో నియమితులైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కొనసాగించారు. ఖాళీలను మాత్రం భర్తీ చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు ఉపక్రమించారు. మున్సిపల్ కౌన్సిల్‌తో పనిలేకుండానే గతేడాది ఆగస్టులో 85 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తొలగింపు నోటీసులను అందజేశారు. దీనిపై విమర్శలు రావడం.. కూటమి నేతల మధ్య విభేదాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు అదే ప్రక్రియకు తెర తీశారని సమాచారం.



పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం

ఆర్థిక భారం తగ్గించాలని..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల సంగతి ఎలాగున్నా, వీరికి మాత్రం ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు వచ్చేలా చూసింది. వీరి హాజరును జిల్లా కలెక్టర్ ద్వారా కార్పొరేషన్‌కు వెళుతుంటే వీరికి వేతనాలు క్రమం తప్పకుండా వస్తుండేవి. మధ్యలో ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఉండేవి కావు. వీరికి ఉద్యోగ భద్రత కూడా ఉంది. నిర్దిష్టమైన ఆరోపణలు.. అవి కూడా నిరూపణ అయితేనే వీరిని ఉద్యోగం నుంచి తొలగించడానికి అవకాశం లేకుండా చేశారు. అయినప్పటికీ పనులు సరిగ్గా చేయడం లేదనీ.. మున్సిపాలిటీ ఆర్థికభారం తగ్గించుకోవాలనే నెపంతో తొలగింపునకు పూనుకున్నారు.

నేడు జాబ్ మేళా

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.జాబ్ మేళాలో 12 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు.